RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 11 సంచిక : 94 సోమవారం 17 - 11 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ

## రాజ్ భవన్‌లో ఉపరాష్ట్రపతికి తేనీటి విందు





హాజరైన సీఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి సాదరంగా స్వాగతం

భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. ఈ మేరకు బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి రాకతో రాజ్‌భవన్‌లో గవర్నర్ తేనీటి విందు ఏర్పాటు చేశారు. గవర్నర్ తేనీటి విందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు తదితరులు హాజరయ్యారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ దీనికి సంబంధించిన ఫోటోలను పంచుకున్నారు.

# నవ్వులు చిందించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు

- రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమం
- ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు జయంతి
- హైదరాబాద్‌లో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం
- ఏడు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి పురస్కారాలు
- హాజరైన ఉపరాష్ట్రపతి, కేంద్రమంత్రులు, తెలుగు రాష్ట్రాల సీఎంలు
- జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళ-సంస్కృతి, యూత్ ఐకాన్, మహిళా సాధికారత వంటి ఏడు రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి ఈ వేదికపై అవార్డులను ప్రదానం



రామోజీరావు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రామోజీ ఫిలింసిటీలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, సినీ ప్రముఖులు మురళీమోహన్, బ్రహ్మానందం తదితరులు హాజరయ్యారు.జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళ-సంస్కృతి, యూత్ ఐకాన్, మహిళా సాధికారత వంటి ఏడు రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి - మిగతా 2 లో

పవన్ కల్యాణ్ వల్ల ఇతర మతాల్లోకి వెళ్లిన

## హిందువుల్లో ఆలోచన మొదలైంది



కేంద్రమంత్రి బండి సంజయ్

హిందువులు ఓటు బ్యాంకుగా మారాలని బండి సంజయ్ పిలుపు

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంపై కీలక వ్యాఖ్యలు

మతం మారిన వారు తిరిగి హిందూ ధర్మంలోకి రావాలని విజ్ఞప్తి

రాష్ట్రంలోని హిందువులంతా ఏకతాటిపైకి వచ్చి ఓటు బ్యాంకుగా మారాలని కేంద్రమంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం తర్వాత హిందువుల్లో కసి పెరిగిందని, ఇకనైనా మేల్కొని ఐక్యత - మిగతా 2 లో

## తెరుచుకున్న శబరిమల ఆలయం




మండల-మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్ షురూ

నేటి నుంచి భక్తులకు స్వామి వారి దర్శనం

ఆన్ లైన్ లో బుకింగ్ చేసుకున్న భక్తులకే అనుమతి

ఆన్ లైన్ లో టికెట్లను బుక్ చేసుకున్న భక్తులను ప్రతిరోజు 70 వేల మందిని దర్శనానికి అనుమతి

శబరిమల అయ్యప్ప స్వామి ఆలయ తలుపులు తెరుచుకున్నాయి. మండల మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్ ప్రారంభం. శబరిమల ప్రధాన అర్చకుడు కందరారు మహేశ్ సమక్షంలో తలుపులు తెరిచి ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి ప్రారంభ పూజ . గర్భగుడి నుంచి జ్వాలను తీసుకొచ్చి 18 మెట్లు వద్ద అధి

దిల్లీ పేలుడు ఘటనలో

# మరో వైద్యురాలు అరెస్ట్

- 10 రోజులు అక్కడే ఉన్న ఉమర్!
- అనంత్‌నాగ్‌లో ప్రియాంక ఉంటున్న వసతి గృహంపై దాడి చేసి, ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు
- దాదాపు 200మంది కశ్మీర్ వైద్యులపైన, దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న కశ్మీర్ విద్యార్థులపైనా నిఘా



దేశ రాజధాని దిల్లీ జరిగిన పేలుడు ఘటన భారతావనిని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఈ ఘటనలో ఎంతో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇంతటి ఘోరానికి పాల్పడిన ఉన్మాదులను బయటకు లాగాలని దర్యాప్తు బృందాలు కంకణం కట్టుకున్నాయి. ఈ నేపథ్యంలోనే జమ్మూ కశ్మీర్‌లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యురాలు ప్రియాంక శర్మను అదుపులోకి తీసుకున్నట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. - మిగతా 2 లో

## ఏకంగా 7 ప్రయోగాలు

- చంద్రయాన్ 4 నుంచి గగన్‌యాన్ వరకు ఇస్రో ప్లాన్ ఇదే!



- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు 7 ప్రయోగాలు చేయాలని లక్ష్యం
- చంద్రయాన్-4 మిషన్‌కు కేంద్ర ఆమోదం తెలిపిందన్న ఇస్రో చీఫ్ వి.నారాయణన్
- చంద్రయాన్, గగన్‌యాన్‌పై కీలక అప్డేట్స్ ఇచ్చిన ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్
- 2023 నాటికి భారత్ సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని లక్ష్యం
- చంద్రుడి దక్షిణ ధృవంలోని మంచును అధ్యయనం చేయడమే లూపెక్స్ మిషన్ ఉద్దేశమని తెలిపారు

ఇస్రో ముందు చంద్రయాన్-4, గగన్‌యాన్, సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, ఉపగ్రహాల ప్రయోగాలు సహా అనేక మిషన్లతో కూడిన భారీ ప్రణాళిక ఉందని ఆ సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, భవిష్యత్‌లో చేపట్టే ప్రయోగాల గురించి వివరించారు. ప్రస్తుతం ఇస్రో ఆ మిషన్లతో అత్యంత - మిగతా 2 లో

## ఏపీలో 20కి పైగా జపాన్ సంస్థల పెట్టుబడులు




వెల్లడించిన ఆ దేశ రాయబారి

ఆంధ్రప్రదేశ్‌లో 20కి పైగా జపాన్ సంస్థల పెట్టుబడులు

సాంకేతిక, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధికి సహకరిస్తామన్న జపాన్ రాయబారి ఒనో కేయిచి

భారత్ అభివృద్ధిలో జపాన్ కీలక భాగస్వామిగా ఉందని జపాన్ రాయబారి ఒనో కేయిచి అన్నారు

'అనకాపల్లిలోని అమ్మోనియా పరిశ్రమలో 18 శాతం వాటాను 50 శాతం వరకు పెంచుతాం

## సారీ అండీ... ఇవాళ సండే



- మంత్రి నారా లోకేశ్ ఇంట్రెస్టింగ్ ట్వీట్
- కొత్త పెట్టుబడుల ప్రకటనపై మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్
- ఆదివారం సెలవని, ఇండియా-దక్షిణాఫ్రికా మ్యాచ్ చూస్తున్నానని వెల్లడి
- విశాఖ సీఐఐ సదస్సు భారీ విజయం సాధించిన నేపథ్యంలో ఈ స్పందన
- సదస్సులో మూడు రోజుల్లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు
- మొత్తం 613 ఒప్పందాల ద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఫలించిందని విశ్లేషణలు

భారీ పెట్టుబడుల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారా?... బ్రేకింగ్ న్యూస్.. క్షమించండి, ఈరోజు ఆదివారం మాకు సెలవు!" అంటూ ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ చేసిన ఓ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. "ఇండియా-దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్ ఎంతో ఉత్కంఠగా సాగుతోంది. మేం ఆ మ్యాచ్ చూడటంలో బిజీగా ఉన్నాం" అని ఆయన తన ట్వీట్‌లో సరదాగా పేర్కొన్నారు.విశాఖపట్నంలో మూడు రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు భారీ విజయం సాధించిన నేపథ్యంలో.. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు రానున్నాయని అందరూ ఆశిస్తున్న తరుణంలో లోకేశ్ ఈ విధంగా స్పందించారు. - మిగతా 2 లో

# రాజ్యాంగం వల్లే చాయ్‌వాలా ప్రధాని అయ్యారు


- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కార్యక్రమం
- 2047కల్లా ప్రపంచంలో ప్రభావవంతమైన దేశంగా భారత్ మారుతుందన్న సీఎం
- అంబేద్కర్ అత్యున్నత రాజ్యాంగం రూపొందించారని వెల్లడి
- మంగళగిరి ఏపీ హైకోర్టు న్యాయవాదుల కార్యక్రమంలో సీఎం ప్రసంగం
- ఆర్థిక సంస్కరణలు దేశ దిశనే మార్చేశాయన్న ముఖ్యమంత్రి




బీఆర్ అంబేద్కరం అత్యున్నతమైన రాజ్యాంగం రూపొందించారని సీఎం చంద్రబాబు అన్నారు. చాయ్‌వాలా దేశానికి ప్రధాని అయ్యారంటే అది మన రాజ్యాంగం వల్లేనని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లయిన పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళగిరిలో కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు సీజే జస్టిస్ బీఆర్ గవాయ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, హైకోర్టు సీజే, న్యాయమూర్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలు దేశ దిశనే మార్చేశాయని అన్నారు. 2014లో 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న మనం ఇప్పుడు 4వ ఆర్థిక వ్యవస్థకు చేరామన్నారు. వచ్చే ఏడాది భారత్ ప్రపంచంలో మూడో, 2038 నాటికి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కాబోతోందని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా - మిగతా 2 లో

# సంపాదకీయం

## వైఫల్యం - విషాదం



ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. పద మూడు మందిని పొట్టన బెట్టుకొని, తీవ్రగా యాలతో అనేకులను ఆస్పత్రిపాల్జేసిన ఈ దారు ణంలో కుట్రదారులను, కార్యక ర్తలనూ వెతికిపట్టుకొనే ప్రయత్నం ముమ్మరంగా సాగు తోంది. పదిమందిని అనుమా నితులుగా అరెస్టు చేయడంతో పాటు, ఢిల్లీ పోలీసులు కొన్ని ప్రాంతాల్లో హెూటళ్ళనూ, నివాసగృహాలను ఇంకా జల్లెడపడుతున్నారు. కశ్మీర్‌లోనూ గాలింపు కొనసాగుతోంది. ఆర్డీఎక్స్ స్థానంలో అతి సులువుగా అందుబాటులో ఉండే అమ్మోనియం నైట్రేట్‌తో ఆ దుర్మార్గులు ఇంతటి ఘోర విధ్వంసాన్ని సృష్టించారు. వీరి ఉన్మాదానికి సామాన్యులు, ఆటోడ్రైవర్లు, దుకాణదారులు బలైపోయారు. కొన్ని వందలమీటర్ల దూరంవరకూ శరీర అవయవాలు తెగినపడిన ఆ భీతావహదృశ్యాలు మనలను దీర్ఘకాలం వెంటాడతాయి. జవాబులేని ప్రశ్నలు అనేకం మిగిలే ఉన్నాయి. ఈ విస్ఫోటనానికి ముందు కశ్మీర్‌లో ఏడుగురు అరెస్టుకావడం, ఫరీదాబాద్‌లో భారీగా పేలుడుపదార్థాలు దొరకడం వంటి పలు పరిణామాలను గుదిగుచ్చే ప్రయత్నం సాగుతోంది. ఇటువంటి ఘటనలు జరగ్గానే, విధ్వంసం తీవ్రత, విధానాలను బట్టి దర్యాప్తు సంస్థలు కొద్దిగంటల్లోనే దానిని ఉగ్రవాదచర్యగా గుర్తించడం, ఏ సంస్థ ఉన్నదో అంచనాకట్టడం జరిగిపోతుంది. ఎర్రకోట ఘటనలో ఢిల్లీ పోలీసులు, ఎన్‌ఐఏ నోరువిప్పడంలేదు. దీంతో తనకు అనధికారికంగా తెలిసినదానినో, ఊహించినదానినో మీడియా చెప్పుకుంటోంది. డిసెంబరు 6న ముప్పైకిపైగా వరుసపేలుళ్ళతో విధ్వంసాన్ని సృష్టించడానికి ఈ మతోన్మాదులు సర్వం సిద్ధం చేసుకున్నారని వార్తలు వస్తున్నాయి. ఒక్కకారుతో, అదీ హడావుడిలోనే ఇంతటి వినాశనం కలగచేయగలిగిన ఆ దుర్మార్గుల అసలు లక్ష్యం నెరవేరినపక్షంలో ఎంతటి ప్రాణనష్టం జరిగివుండేదో తలుచుకుంటేనే భయం కలుగుతుంది. జమాతే ఇస్లామీ, జైషే మహ్మద్ వంటి సంస్థలతో పాటు, తుర్కియే తోడ్పాటు కూడా ఉన్నట్టు వింటున్నాం. దారుణం జరగ్గానే కుట్ర, భయానకం వంటి మాటలు మాత్రమే వాడిన పాలకులు రెండురోజులకు గానీ ఉగ్రచర్యగా గుర్తించలేదు. ఇంతలోగా ప్రధాని మోదీ భూటాన్ కూడా వెళ్ళి, కుట్రదారులను వదిలేది లేదని అక్కడ ఓ భీషణ ప్రతిజ్ఞచేశారు. ఎన్‌ఐఏకు కేసు అప్పగించడం, ఊపావంటి చట్టాలను ప్రయోగించడం కుట్రదారులమీద వదిలిపెట్టకుండా ఉండటానికే.క్రమంగా పాక్‌పాత్ర, జైషే హస్తం, ముంబైతరహా మరో విధ్వంసానికి విస్తృతమైన ప్రణాళిక ఇందులో స్పష్టం కావడంతో ఉగ్రవాదం అనకతప్పలేదు. ఆపరేషన్ సిందూర్ జోరుగా సాగుతూండగా, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అది ఆగిపోయిందని ముందే ప్రకటించి మన పాలకులను ఇరకాటంలో పడేశారు. ఆ తరువాత ఆయన ఓ యాభైసార్లు తానే యుద్ధాన్ని ఆపాననీ చెప్పుకున్నారు. ఇక చాలు మహాప్రభో అని పాక్ మిలటరీ అధికారులు ప్రాధేయపడడంతో తామే సిందూర్‌ను ఆపామని మన నాయకులు చెప్పుకున్నారు. ఇకపై ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వబోమన్న కనీస హామీ కూడా లేకుండా, కేవలం శత్రువు బతిమాలితే యుద్ధం ఆపేయడమేమిటని విపక్షాలు నిలదీశాయి. ఇకపై ఉగ్రచర్యలన్నీ యుద్ధచర్యలుగానే పరిగణిస్తామని స్వయంగా ప్రధాని ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ఎర్రకోట ఘటనను ఉగ్రచర్యగా గుర్తించడం ప్రభుత్వానికి ఒక విధంగా ఇబ్బందే. ట్రంప్‌తో వీసమెత్తు సయోధ్యలేని స్థితిలో, ఆయన పూర్తిగా పాకిస్థాన్ పక్షాన, మార్షల్ మునీర్ ప్రేమలో తేలుతున్న తరుణంలో గతంలో మాదిరిగా సిందూర్‌లు సాధ్యం కాదు. పాలకులు కూడా కుట్రదారులకు ప్రభుత్వ ఏజెన్సీలు తగిన గుణపాఠం చెబుతాయని మాత్రమే అంటున్నారు. ఒక మహా విధ్వంసం దిశగా సాగుతున్న కుట్ర ముందుగానే ఎర్రకోటవద్ద బద్దలుకావడం ఒక విధంగా ఉపశమనం కలిగించేదే. అయితే, రోజంతా భారీ పేలుడుపదార్థాలతో ఒక వ్యక్తి కీలకమైన ప్రాంతాల్లో సంచరించగలగడం మన నిఘావైఫల్యానికి నిదర్శనం. దీనికి పదిరోజులముందే కశ్మీర్, ఫరీదాబాద్‌లో ఉగ్రచర్యలను పోలీసులు భగ్నం చేసినా, దూరదృష్టి, సమన్వయం, సమాచార లోపంతో ఈ దారుణాన్ని నిలువరించలేకపోవడం అతిపెద్ద విషాదం. శక్తిమంతమైన లెఫ్టినెంట్ గవర్నర్ ఉన్న జమ్మూకశ్మీర్, బీజేపీ పాలిత హర్యానా, యూపీ, ఢిల్లీలమీదుగా ఈ ఉగ్రకుట్ర సాగడంతో విపక్షాలు పుల్వామా, పహల్గాం వైఫల్యాలను కూడా గుర్తుచేస్తూ కేంద్రాన్ని ఘాటుగా విమర్శించడం సహజం.

# సారీ అండీ... ఇవాళ సండే

**మొదటిపేజీ తరువాయి –** ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడుల వరద పారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక కృషితో ఈ సదస్సు విజయవంతమైంది.ఈ సదస్సులో మొత్తం 613 ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ ఒప్పందాల వల్ల భవిష్యత్తులో సుమారు 16 లక్షల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## నవ్వులు చిందించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు

**మొదటిపేజీ తరువాయి –** ఈ వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు. రామోజీరావు స్ఫూర్తిని కొనసాగిస్తూ వివిధ రంగాల్లో అద్భుతమైన కృషి చేసిన వారిని ఈ పురస్కారాలతో సత్కరించనున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్కపక్కనే ఆసీనులై నవ్వుతూ మాట్లాడుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇద్దరు నేతలు నవ్వులు చిందిస్తూ ముచ్చటించుకుంటున్న దృశ్యాలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

## పవన్ కల్యాణ్ వల్ల ఇతర మతాల్లోకి వెళ్లిన హిందువుల్లో ఆలోచన మొదలైంది

**మొదటిపేజీ తరువాయి –** చాటాలని ఆయన అన్నారు. కూకట్‌పల్లిలో నిర్వహించిన కాపు కులస్తుల కార్తిక వన భోజనాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో ముస్లింలకు కొమ్ముకాసే దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. మతం మార్చుకోవడం అంటే దేవుళ్లను మోసం చేయడమేనని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇతర మతాల్లోకి వెళ్లిన వారంతా 'ఘర్ వాపసీ' ద్వారా తిరిగి హిందూ ధర్మంలోకి రావాలని కోరారు. అలా తిరిగి వచ్చేవారి కోసం హిందూ ధర్మ రక్షణ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని హామీ ఇచ్చారు.హిందువుగా పుట్టడం గర్వకారణమని, హిందూ సనాతన ధర్మం ఎంతో గొప్పదని బండి సంజయ్ తెలిపారు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మంపై చేస్తున్న ప్రచారం వల్ల ఇతర మతాల్లో చేరిన హిందువుల్లో పునరాలోచన మొదలైందన్నారు. మోసపోయి ఇతర మతాల్లోకి వెళ్లిన వారిని ఆదుకునే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. కులాలు తమ సామాజికవర్గ సంక్షేమం కోసం పనిచేస్తూనే, హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. హిందూ సనాతన ధర్మ రక్షణే తన జీవిత లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## తెరుచుకున్న శబరిమల ఆలయం



**మొదటిపేజీ తరువాయి –** (పవిత్ర మంట)ను వెలిగించారు.

**నేటి నుంచి భక్తులకు అనుమతి..**

ఆలయ తలుపులు ఆదివారమే తెరుచుకున్నా నేటి నుంచే భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతిస్తారు.నేటి తెల్లవారుజామున అధికారిక ఆచారాలు, కొత్త పూజారులు తలుపులు తెరవడంతో మండల మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్ ప్రారంభమవుతుంది. ఆన్ లైన్ లో టికెట్లను బుక్ చేసుకున్న భక్తులను ప్రతిరోజు 70 వేల మందిని దర్శనానికి అనుమతిస్తారు. పంబ, నీలక్కల్, ఎరుమేలి, వండి పెరియార్ సత్రం, చెంగన్నూరులలో స్పాట్ బుకింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. కాగా, ఈ సీజన్ లో అయ్యప్పను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ట్రావెన్ కోర్ దేవోసం బోర్డు ఓ ప్రకటనలో వెల్లడించింది.

# రాజ్యాంగం వల్లే చాయ్‌వాలా ప్రధాని అయ్యారు

**మొదటిపేజీ తరువాయి –** అవతరించాలన్నది లక్ష్యమని అన్నారు. ప్రజాస్వామ్యం గాడి తప్పినప్పుడు న్యాయ వ్యవస్థే దాన్ని గాడిన పెడుతోందని తెలిపారు. "మీడియా రంగంలోనూ ఇటీవల చాలా మార్పులు వచ్చాయి. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ రైటరే, ప్రతి ఒక్కరూ ఎడిటరే. సామాజిక మాధ్యమాలను వ్యక్తిత్వ హననానికి ఉపయోగించడం దురదృష్టకరం" అని సీఎం చంద్రబాబు అన్నారు.అద్భుతమైన రాజ్యాంగాన్ని అంబేద్కర్ మనకు అందించారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా మంగళగిరిలో హైకోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. భారత రాజ్యాంగం అందించే స్ఫూర్తి చాలా గొప్పదన్న ముఖ్యమంత్రి రాబోయే రోజుల్లో భారత్ అన్నిరంగాల్లో నిపుణులను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2047కల్లా ప్రపంచంలో ప్రభావవంతమైన దేశంగా భారత్ మారుతుందని సీఎం వ్యాఖ్యానించారు.'అద్భుతమైన రాజ్యాంగాన్ని అంబేద్కర్ మనకు ఇచ్చారు. ఓ ఛాయ్ వాలా మోదీ దేశానికి ప్రధాని కాగలిగారు. భారత రాజ్యాంగం అందించే స్ఫూర్తి చాలా గొప్పది. రాబోయే రోజుల్లో భారత్ అన్నిరంగాల్లో నిపుణులను అందిస్తుంది. 2014లో 11వ స్థానంలో ఉన్న భారత్ క్రమంగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం ప్రపంచంలోనే 4వ లార్జెస్ట్ ఎకనామీగా భారత్ ఎదిగింది. 2047 కల్లా ప్రపంచంలో ప్రభావవంతమైన దేశంగా భారత్ మారుతుంది. వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది న్యాయవ్యవస్థ కీలక బాధ్యత వహిస్తోంది. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ అభిప్రాయాలు తెలియజేస్తున్నారు. సోషల్ మీడియాలో కొందరు వ్యక్తి




హననానికి పాల్పడటం దురదృష్టకరం. హెల్తీ హ్యాపీ సొసైటీ స్థాపనే రాజ్యాంగం లక్ష్యం.'

# ఏపీలో 20కి పైగా జపాన్ సంస్థల పెట్టుబడులు

**మొదటిపేజీ తరువాయి –** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు 20కి పైగా జపాన్ సంస్థలు ఆసక్తి చూపి ముందుకొచ్చాయని జపాన్ రాయబారి ఒనో కేయిచి పేర్కొన్నారు. భారత్ అభివృద్ధిలో జపాన్ కీలక భాగస్వామిగా ఉందని ఆయన అన్నారు. సాంకేతిక, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధికి సహకరిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఏపీ అభివృద్ధికీ అన్ని విధాలుగా తోడ్పాటున ందిస్తామని వివరించారు.పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో భాగంగా నిర్వహించిన 'కంట్రీ సెషన్'లో జపాన్ రాయబారి ఒనో కేయిచి ఏపీలో పెట్టనున్న పెట్టుబడులను ఉద్దేశించి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులన్నీ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దార్శనికతతో ఆలోచించే సీఎం చంద్రబాబు ఇక్కడ ఉన్నారని గుర్తు చేశారు. అందుకే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు మొగ్గు చూపిస్తున్నారు' అని రుసాల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఆంటోన్ బెంజులేవా పేర్కొన్నారు. 'అనకాపల్లిలోని అమ్మోనియా పరిశ్రమలో మా సంస్థకు 18 శాతం వాటా ఉంది. దాన్ని 50 శాతం వరకు పెంచుతాం. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం' అని




వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుకు విశాఖపట్నం అనుకూల ప్రాంతమని చెప్పారు.గేట్‌వే ఆఫ్ ఇండియాగా ఆంధ్రప్రదేశ్: ఏపీ గేట్‌వే ఆఫ్ ఇండియాగా ఉంది. పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలంగా ఉంది. వ్యవసాయ రంగం, ఉత్పత్తి కేంద్రాలు, ఏఐ వంటి రంగాలు గణనీయంగా వృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. 3 దశాబ్దాలుగా భారత్‌కు అల్యూమినియం సరఫరా చేస్తున్నామని ఆ దేశ ప్రతినిధులు అన్నారు. పర్యావరణానికి ఏ విధమైన హాని లేకుండా పరిశ్రమల స్థాపనకు సహకరిస్తామని రష్యన్ సమాఖ్య పరిశ్రమలు, వాణిజ్య శాఖ డిప్యూటీ మినిస్టర్ అలెక్సీ గ్రూజ్‌దేవ్ హామీ ఇచ్చారు.భారత్, రష్యా దేశాలు తమ భాగస్వామ్యాన్ని మరింత విస్తరిస్తున్నాయని, ప్రపంచ పారిశ్రామికీకరణలో కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. 'వ్యూహాత్మక పారిశ్రామిక, సాంకేతిక భాగస్వామ్యం' అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్‌బెర్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఆండ్రీ అనిసిమోవ్ మాట్లాడుతూ ప్రపంచ పారిశ్రామిక యుగంలో ఇరుదేశాలు తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకుంటున్నాయనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.కేంద్ర, రాష్ట్ర సమన్వయంతో పరిశ్రమలు: ఏపీ అభివృద్ధిలో సూపర్ స్పీడులో దూసుకుపోతుందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ప్రపంచ దేశాలకు పెట్టుబడులను పెట్టేందుకు విశాఖపట్నం అత్యంత అనుకూలమైన ప్రాంతమని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి పెట్టుబడులతో వస్తే అన్ని సౌకర్యాలను కల్పించి ప్రోత్సహిస్తామని టీజీ భరత్ పేర్కొన్నారు.రెండు రోజుల పాటు భాగస్వామ్య సదస్సు ఎంతో అద్భుతమగా జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

# ఢిల్లీ పేలుడు ఘటనలో మరో వైద్యురాలు అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి –** ఆమె హరియాణా వాసిగా గుర్తించారు. అయితే ఇటీవల అరెస్టు అయిన నిషేధిత జైషే మహ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధమున్న ముగ్గురు వైద్యుల్లో ఒకరైన అదీల్ అహ్మద్‌తో ఆమెకు పరిచయం ఉన్నట్లు తెలిపారు.అనంత్‌నాగ్‌లో ప్రియాంక ఉంటున్న వసతి గృహంపై దాడి చేసి, ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ విషయంపై మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి ఆమె మొబైల్ ఫోన్, సిమ్ కార్డును ఫోరెన్సిక్ బృందాలు పరిశీలిస్తున్నాయని తెలిపారు. దాదాపు 200మంది కశ్మీర్ వైద్యులపైన, దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న కశ్మీర్ విద్యార్థులపైనా నిఘా పెట్టామన్నారు. మరోవైపు ఢిల్లీలో ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన బాంబర్ డాక్టర్ ఉమర్ హరియాణాలోని నూహ్‌లో కొన్ని రోజులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పేలుడుకు 10 రోజుల ముందే అక్కడి హిదాయత్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడని, ఈ ఘటనకు ముందు వరకు ఆ ఇంట్లోనే ఉన్నాడని తెలిపారు.నవంబర్ 10వ తేదీన అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అతడు తన ఐ-20 కారులో పేలుడు పదార్థాలను తీసుకొని బయల్దేరాడని చెప్పారు. వాస్తవానికి అతడు ఫిరోజ్‌పుర్‌లోని ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేయడానికి యత్నించాడని, అది సాధ్యం కాకపోవడంతో చివరికి నూహ్‌కు వచ్చి ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఉన్నట్లు దర్యాప్తు బృందాలు చెబుతున్నాయి. ఆ ఇంట్లో అతడు ఉంటున్నట్లు చుట్టుపక్కలవారికి కూడా తెలియదని పేర్కొన్నారు. ఆ జిల్లాలో ఇంటెలిజెన్స్ వర్గాలకు ఎటువంటి అనుమానం రాలేదని, స్థానికంగా ఉన్న ఓ అల్ట్రాసౌండ్



స్కానింగ్ సెంటర్‌కు అమర్చిన సీసీ కెమెరాల్లో ఉమర్ కారు ఆ కాలనీలోకి ప్రవేశిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**అసలేం జరిగింది :**

ఢిల్లీలో ఎర్రకోటకు అతి సమీపంలో కారులో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఈ పేలుడుకు కారణమైన ఐ20 కారు నడిపిన వ్యక్తిని డాక్టర్ ఉమర్ నబీ అని పోలీసులు గుర్తించారు. అనంతరం అతడితో సంబంధమున్న ఐదుగురు వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. వారందరికీ ఉగ్రసంస్థలతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. దీంతో వారితో కలిసి చదువుకున్న, పని చేస్తున్న ఇతర డాక్టర్లపై కూడా నిఘా పెట్టారు. ఉగ్ర కుట్రలో ఫరీదాబాద్‌లోని అల్-ఫలా యూనివర్సిటీ సిబ్బంది పాత్ర ఉండడం, నిందితులకు సంబంధించిన మరో కారు కూడా అక్కడే లభ్యం కావడంతో క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం చేయడంతోపాటు ముమ్మర తనిఖీలు చేపట్టారు. అదే కళాశాలలో చదివిన మరో ఇద్దరిని శనివారం ఎన్‌ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

# ఏకంగా 7 ప్రయోగాలు

**మొదటిపేజీ తరువాయి –** బిజీగా మారిందని చెప్పారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు 7 ప్రయోగాలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు వి.నారాయణన్ తెలిపారు. వీటిలో పీఎస్ఎల్‌వీ, గగన్‌యాన్ మిషన్లతో పాటు ఓ వాణిజ్య కమ్యూనికేషన్ ఉపగ్రహ ప్రయోగం కూడా ఉందని చెప్పారు. అంతేకాదు పూర్తిగా దేశీయంగా తయారు చేసిన పీఎస్ఎల్‌వీ ప్రయోగం కూడా ఇందులో ఉంటుందని పేర్కొన్నారు.

**చంద్రయాన్-4**

కేంద్ర ప్రభుత్వం చంద్రయాన్-4 మిషన్‌కు ఆమోదం తెలిపిందని ఇస్రో చీఫ్ వి.నారాయణన్ తెలిపారు. 2028 నాటికి చంద్రుడి నుంచి మట్టి నమూనాలను సేకరించి ఈ భూమిపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఇది పనిచేస్తుందని చెప్పారు. ప్రస్తుతం రష్యా, అమెరికా, చైనాలకు మాత్రమే చంద్రుని నుంచి నమూనాలు సేకరించే టెక్నాలజీ ఉంది. అందుకే ఇస్రో సొంతంగా చంద్రుని నుంచి మట్టి నమూనాలు సేకరించే క్లిష్టమైన టెక్నాలజీని సొంతం చేసుకోవాలని చూస్తోంది.

**సొంత అంతరిక్ష కేంద్రం**

2023 నాటికి భారత్ సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇస్రో ఛైర్మన్ పేర్కొన్నారు. ఇప్పటికే దీని నిర్మాణ పనులు మొదలు అయ్యాయని తెలిపారు. 2028 నాటికి 5 మాడ్యూల్స్‌ను కక్ష్యలో ఉంచుతామని చెప్పారు. ఇదే జరిగితే అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసుకున్న మూడో దేశంగా భారత్ అవతరిస్తుంది.జపాన్ అంతరిక్ష సంస్థ (జేఏఎక్స్ఏ)తో కలిసి చేపట్టిన లూపెక్స్ మిషన్ కూడా తమ ప్రణాళికలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంలోని మంచును అధ్యయనం చేయడమే ఈ ప్రయోగ ఉద్దేశమని తెలిపారు. ఇకపై మిషన్ల డిమాండ్‌కు అనుగుణంగా, వచ్చే మూడేళ్లలో వ్యోమనౌకల వార్షిక ఉత్పత్తిని 3 రెట్లు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన వెల్లడించారు.

**గగన్‌యాన్ టైమ్‌లైన్ :** గగన్‌యాన్ మిషన్‌పై నెలకొన్న సందేహాలపై ఇస్రో ఛైర్మన్ స్పష్టత ఇచ్చారు. మానవ సహిత గగన్‌యాన్ మిషన్ ముందు అనుకున్నట్లుగానే 2027 నాటికి చేపడతామని స్పష్టం చేశారు. కేవలం మానవ రహిత గగన్‌యాన్ ప్రయోగం గడువు మాత్రమే కాస్త మారిందని పేర్కొన్నారు. భారత వ్యోమగాములతో చేపట్టే తొలియాత్రకు ముందు 3 మానవ రహిత టెస్టింగ్? మిషన్లు జరుగుతాయన్నారు. మన వ్యోమగాములను చంద్రుడిపైకి పంపి, తిరిగి సురక్షితంగా భూమికి తీసుకువచ్చే మిషన్‌ను 2024 నాటికి సాకారం చేయాలని ప్రధాని మోదీ సూచించినట్లు వి.నారాయణన్ పేర్కొన్నారు.

**ఇండియన్ స్పేస్ ఎకానమీ సంగతేంటి :** ప్రస్తుతం ఇండియన్ స్పేస్ ఎకానమీ విలువ 8.2 బిలియన్ డాలర్లు. కానీ ప్రపంచ స్పేస్ ఎకానమీలో భారత్ వాటా కేవలం 2% వరకు మాత్రమే ఉంది. అందుకే దీనిని 2030 నాటికి 8%కి పెంచాలని ఇస్రో భావిస్తోంది. కాగా, 2033 నాటికి భారత్ స్పేస్ ఎకానమీ 44 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఓ అంచనా. అయితే ప్రస్తుతం 630 బిలియన్ డాలర్లుగా ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ, 2023 నాటికి 1. ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఇస్రో చీఫ్ అంచనా వేశారు.'భారతదేశం విషయానికి వస్తే, 2020లో అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం బాగా పెరిగింది. కొన్నేళ్ల క్రితం దేశంలో కేవలం 3 స్టార్టప్‌లు ఉండగా, ఇప్పుడు ఏకంగా 450 స్టార్టప్?లు పుట్టుకొచ్చాయి. అందులో 330 స్టార్టప్?లు చాలా చురుగ్గా పనిచేస్తున్నాయి' అని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు.

# ఇమ్మడి రవితోనే ఐ బొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్‌లను షట్ డౌన్ చేయించిన పోలీసులు

**ఐ బొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్ల నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్**

**ఫ్రాన్స్ నుంచి రాగానే ఎయిర్‌పోర్ట్‌లో పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు**

**గతంలో పోలీసులకే సవాల్ విసిరిన పైరసీ కింగ్‌పిన్**

**రూ.3 కోట్ల నగదు, వందల కొద్దీ హార్డ్ డిస్క్‌లు స్వాధీనం**

**కస్టడీ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ వేయనున్న పోలీసులు**

కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే ఆన్‌లైన్‌లో ఉచితంగా అందిస్తూ సవాల్ విసిరిన 'ఐ బొమ్మ', 'బప్పం టీవీ' వెబ్‌సైట్ల నిర్వాహకుడు, ప్రధాన సూత్రధారి ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. గతంలో "దమ్ముంటే పట్టుకోండి.. నా వెబ్‌సైట్ల జోలికొస్తే మీ డేటా లీక్ చేస్తా" అంటూ పోలీసులకే బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన రవిని.. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ రాగానే శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. తాజాగా, 'ఐ బొమ్మ', 'బప్పం టీవీ' వెబ్‌సైట్లను అతడితోనే శాశ్వతంగా మూసివేయించారు.విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి సైబర్ టెక్నాలజీలో అత్యంత నైపుణ్యం కలిగిన వ్యక్తి. తనకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ పైరసీ ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. తొలుత సాధారణ స్థాయిలో మొదలుపెట్టి, ఐ బొమ్మ, బప్పం వంటి వెబ్‌సైట్లను సృష్టించి తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భాషల చిత్రాలను, ఓటీటీ కంటెంట్‌ను పైరసీ చేస్తూ వచ్చాడు. తన కార్యకలాపాలను ఎవరూ గుర్తించకుండా ఫ్రాన్స్‌లో నివసిస్తూ, కరేబియన్ దీవులు, యూరప్ దేశాల్లోని ఆఫ్‌షోర్




సర్వర్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను నడిపాడు. భార్యతో విడిపోయిన తర్వాత ఒంటరిగా జీవిస్తున్న రవి, తన పూర్తి సమయాన్ని ఈ పైరసీ సామ్రాజ్యాన్ని విస్తరించడానికే కేటాయించాడు.

**అత్యాధునిక టెక్నాలజీతో పైరసీ దందా**

రవి తన పైరసీ కార్యకలాపాలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాడు. పోలీసులు ఒక డొమైన్‌ను బ్లాక్ చేస్తే, వెంటనే వంటి మిర్రర్ సైట్లను అందుబాటులోకి తెచ్చేవాడు. థియేటర్లలో మొబైల్ ఫోన్లతో రికార్డ్ చేసిన కాపీలు, ప్రొడక్షన్ హౌస్‌ల నుంచి లీకైన స్క్రీనర్ కాపీలను సంపాదించి టొరెంట్ ఫైల్స్‌గా మార్చి అప్‌లోడ్ చేసేవాడు. తనను ఎవరూ ట్రేస్ చేయకుండా %వూచీ, ౹ూ=% నెట్‌వర్క్‌ల ద్వారా ఎన్‌క్రిప్టెడ్ పద్ధతిలో ఫైల్స్‌ను సర్వర్లకు చేరవేసేవాడు. అంతేకాకుండా, నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వంటి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల నుంచి కంటెంట్‌ను ఆటోమేటిక్‌గా డౌన్‌లోడ్ చేయడానికి పైథాన్ బాట్స్‌ను ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు.

**ఆదాయం, నష్టం.. పోలీసుల విచారణ**

పాప్-అప్ యాడ్స్, క్రిప్టోకరెన్సీ డొనేషన్ల ద్వారా రవి కోట్లాది రూపాయలు సంపాదించాడు. పోలీసులు ఇప్పటికే అతడి బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.3 కోట్లను ఫ్రీజ్ చేశారు. అతని కార్యకలాపాల వల్ల కేవలం 2024లోనే తెలుగు చిత్ర పరిశ్రమకు రూ.3,700 కోట్లు, భారతీయ సినిమా పరిశ్రమకు మొత్తంగా రూ.24,000 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. గతంలో రవి పోలీసులను హెచ్చరిస్తూ రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై నెటిజన్లు "తెలంగాణ పోలీసులతో పెట్టుకుంటే ఇలాగే ఉంటుంది" అంటూ కామెంట్లు చేస్తున్నారు.2025 ఆగస్టు నుంచి రవి కదలికలపై నిఘా పెట్టిన సైబరాబాద్ పోలీసులు, నవంబర్ 15న హైదరాబాద్ రాగానే అరెస్ట్ చేశారు. ప్రస్తుతం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అతడిపై ఇప్పటికే ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అతని నుంచి స్వాధీనం చేసుకున్న వందలాది హార్డ్ డిస్క్‌లను, క్రిప్టో ఖాతాలను విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు రవిని కస్టడీలోకి తీసుకోవడానికి సోమవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెట్‌వర్క్‌లో భాగమైన ఇతర సభ్యుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# ఆధునిక యంత్రాలతో వ్యవసాయం మరింత లాభసాటి- ప్రణవ్..

- డ్రోన్ స్ప్రే పై రైతులకు అవగాహన కల్పించాలి.
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం.






**తెలంగాణ సేన హుజూరాబాద్ ప్రతినిధి నవంబర్ 16 :** ఆధునిక కాలంలో రైతులకు డ్రోన్ స్ప్రే పై అవగాహన కల్పించి,వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.ఆదివారం రోజున జమ్మికుంట పట్టణంలోని డ్రోన్ స్ప్రే నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా డ్రోన్ స్ప్రే వలన కలిగే లాభాలు,రైతుకు ఏ విధంగా వీటి వాడకం వల్ల ఉపయోగం కలుగుతుందో తెలియజేయాలని నిర్వహుకుణ్ణి కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని,ఇలాంటి ఆధునిక యంత్రాలతో రైతులకు మరింత లాభసాటిగా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన బండపల్లి వెంకటేశ్వర్లు



**మహబుబాబాద్ జిల్లా తెలంగాణ సేన నవంబర్ 16 :** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలానికి చెందిన కామ్రేడ్ వెంకటేశ్వర్లు ఇటీవల ది15/11/2025న నల్లగొండలో జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్లో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

# వార్త రిపోర్టర్ వినోద్ రేడ్డి నూతన గృహప్రవేశం సందర్భంగా ఆశీర్వదించిన వార్త తొర్రూర్ ఇంచార్జ్ మద్ది వెంకటేశ్వర్లు



**మహబుబాబాద్ జిల్లా తెలంగాణ సేన నవంబర్ 16 :** రాజుల కొత్తపల్లి గ్రామంలో నూతన గృహప్రవేశం సందర్భంగా తొర్రూరు వార్త ఆర్ సి ఇన్చార్జి వెంకటేశ్వర్లు హాజరై గృహప్రవేశం సందర్భంగా వారికి ఆశీర్వాదం చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ప్రతి ఒక్కరికి సొంత ఇంటి కల నిజం చేసుకోవాలని వారు మాట్లాడారు ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ చక్రధర్, నర్సింహిలపేట వార్త రిపోర్టర్ సాగర్ తెలంగాణ ఉద్యమకారులు చిత్తా సోమన్న పాల్గొన్నారు..

# ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశానికి హాజరైన వోడితల ప్రణవ్..

- సొంతింటి కళ కోసం ఎదురుచూస్తున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండ.
- కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పెదోల్ల ప్రభుత్వం.
- అర్హులైన అందరికి విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తాం..





**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి నవంబర్ 16:** ప్రతి పేదవారి కుటుంబంలో సొంతింటి కళ అనేది జీవిత లక్ష్యమని అలాంటి కళను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రివర్గం,కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నెరవేరుస్తున్నామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.ఆదివారం రోజున హుజూరాబాద్ పట్టణ పరిధిలోని ఒకటవ వార్డు కొత్తపల్లిలో గౌరవేని లక్ష్మీ నూతన గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గృహ ప్రవేశ సమయంలో లబ్ధిదారు ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు.ఇంటి నిర్మాణం కోసం ఇన్నేళ్లుగా ఎదురు చూశామని ఇప్పుడు ఇళ్లు కట్టుకొని గృహ ప్రవేశానికి వెళ్లడం ఆనందంగా ఉందని తెలిపారు.రాబోయే రోజుల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో అర్హులైన పేదవారికి విడతల వారిగా ఇళ్లు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేతి కైలాసం సేవలు అభినందనీయం

- వంగపల్లి అంజయ్య స్వామి

సిద్దిపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నేతి కైలాసం కు ఘన సన్మానం



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన ప్రముఖ సంఘ సేవకులు ఆర్యవైశ్య నాయకుడు నేతి కైలాసం ను ఆదివారం సిద్దిపేట లో వారి నివాసంలో కలిసి అభినందనలు తెలిపిన ఆధ్యాత్మిక వేత్త వాసవి ఉపాసకులు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన నేతి కైలాసం ను అభినందించి శాలువాతో సత్కరించి యాదగిరిగుట్ట లడ్డు ప్రసాదం అందజేయడం జరిగిందని ఆర్యవైశ్య సంఘానికి విశేష సేవలు అందించి అందరికీ అందుబాటులో ఉంటూ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు

# తెలంగాణ ప్రజల శ్వాసలో కలిసిపోయిన పేరు -సేవకు సమర్థుడు..హరీష్ రావు!

**తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ రాజకీయాల్లో సేవ, నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధత అనే నాలుగు విలువలకు ప్రతిరూపంలా నిలిచే అరుదైన నాయకుడి పేరు ౧ టి. హరీష్ రావు.పదవి కోసం కాదు%౫%ప్రజల కోసం జీవించే నాయకుడు. ప్రచారం కోసం కాదు%౫%పని కోసం రోజూ కష్టపడే యోధుడు. సంక్లిష్ట రాజకీయాల మధ్య కూడా తన విలువలను కాపాడుకున్న అచంచలమైన వ్యక్తిత్వం.ప్రస్తుత కాలంలో రాజకీయాలు విలువలు కోల్పోతున్న సమయంలో%౫%ఒక రోజే మాటలు మార్చే నాయకులు,ప్రమోషన్ కోసం వేదికలు మార్చుకునే నేతలు,చిన్న ప్రయోజనం కోసం సిద్ధాంతాలు అమ్మేసుకునే వాళ్లతో నిండిపోయిన ప్రపంచంలో,ప్రజల కోసం అహర్నిశలు పనిచేసే ఒకే ఒక్క నాయకుడు హరీష్ రావు.



**పదవి లేకున్నా సేవ ఆపని మనసు..**

మంత్రి పదవి ఉన్నా, లేకున్నా..
ఆయన సేవలో, ఆయన పని స్టైలులో ఏ మార్పు లేదు.
అదే నిబద్ధత..అదే వేగం.. అదే బాధ్యత. తెలంగాణ ప్రజలు “మనోడు”అనుకునే అరు దైన నాయకుడు.

**కేసీఆర్‌పై విశ్వాసం పార్టీపై నిబద్ధత..**

తన నాయకుడు కె. చంద్రశేఖర్ రావుపై హరీష్ రావు కి ఉన్న విశ్వాసం ప్రత్యేకం.పార్టీ నిర్ణయం అంటే ఆయన కు ఆజ్ఞ. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ముందువరుసలో నిలబడి రక్షించే ధైర్యవంతుడు.అదే ఆయన ప్రత్యేకత. అదే ఆయన విలువ.

**సేవే ఆయన ప్రచారం...**

పదవులు మార్చుకున్న వాళ్లే గొప్ప నాయకులు అయితే..ప్రజలు ఎందుకు ఆయనను ఇంతగా ప్రేమిస్తున్నారు? ఎందుకు ఆయన పేరే వారిలో భావోద్వేగం రేపుతుంది?

**జవాబు ఒక్కటే – సేవ.?**

నిజాయితీ.పనితీరు.మానవత్వం.ప్రజలు ఆయనను నాయకుడిగా మాత్రమే కాదు,కుటుంబసభ్యుడిగా, తమ మనిషిగా, తమ గర్వంగా చూస్తారు.

**విమర్శలు..**

హరీష్ రావు ని విమర్శించడం అంటే,కొండను రాయితో కొట్టినట్లే. అది తిరిగి విమర్శించిన వారినే తాకుతుంది.ఎందుకంటే ఆయన నిజాయితీని, ఆయన సేవను ప్రజల గుండెల్లోంచి ఎవరూ తుడిచేయలేరు.

# రంగనాయక స్వామి ఆలయంలో లంగర్ హౌస్ ఆర్యవైశ్యుల పూజలు

ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం


**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలోని పురాతన ఆలయం రంగనాయక స్వామి ఆలయంలో ఆదివారం హైదరాబాద్ లంగర్ హౌస్ కు చెందిన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తులసి దామోదర కళ్యాణ మహోత్సవం సామూహిక వాసవి పారాయణం కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రంగనాయక స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు గుండా శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి రాజన్నగారి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రంగనాయక స్వామి ఆలయం ఎంతో మహిమలు గల దేవాలయం అని ఇక్కడి వారితో పాటు ఎంతోమంది సుదూర ప్రాంతాల నుండి ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారని లంగర్ హౌస్ నుండి ఆర్యవైశ్య సంఘం వారు ఇక్కడికి రావడం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని వారిని అభినందించి స్వామివారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు, అనంతరం లంగర్ హౌస్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంకట మధుసూదన్, రెడ్డిశెట్టి కృష్ణమూర్తి మాట్లాడుతూ నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించిన ఆలయ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ ఈ ప్రాంతం చాలా బాగుందని అన్నారు, ఈ కార్యక్రమంలో రంగనాయక స్వామి ఆలయ ప్రధాన అర్చకులు కార్తీక్ దేశాయ్ మాధవ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు మోహన్ రెడ్డి బాలనర్స్ గౌడ్, కార్యవర్గ సభ్యులు, లంగర్ హౌస్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు మహిళలు యువకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు




రంగనాయక స్వామి ఆలయం ప్రాంగణంలో కార్తీక వనభోజనం

# హలో మాల-ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

జాతీయ మాలమహానాడు ములుగు జిల్లా యూత్ అధ్యక్షుడు ఉల్లేరావు శ్రవణ్ కుమార్.



**తెలంగాణసేన :** ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ములుగు నియోజకవర్గం ఇన్చార్జి జనగాం రవీందర్ అధ్యక్షతన, హలో మాల–చలో ఢిల్లీ ప్రోగ్రాం కి ములుగు జిల్లా ఇంచార్జి రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి రాములు, రాష్ట్ర పోలీట్ బ్యూరో సభ్యుడు చిట్టిమల్ల సమ్మయ్య గార్లు ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో నవంబర్ 26న రాజ్యాంగ హక్కుల సాధన కోసం “ఛలో ఢిల్లీ” కి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. జాతీయ మాల మానాడు తెలంగాణ రాష్ట్ర పోలీస్ బ్యూరో సభ్యుడు చిట్టిమల్ల సమ్మయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆమోదంలోకి వచ్చిన రోజు నవంబర్ 26 రోజే ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద రాజ్యాంగ హక్కుల సాధన సభ జరపడం జరుగుతుందని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ఈ దేశంలోని పౌరులకు హక్కులు మరియు దేశ ప్రజలందరికీ, ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచుకునే అవకాశాన్ని కల్పించిన మహోన్నత నాయకుడు బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచ దేశాలలోనే ఎక్కడ లేని విధంగా, మహిళలకు, పురుషులతో సమానమైన హక్కులను కల్పించిన మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ గారు, ఈ దేశానికి సుస్థిర మహోత్తర రాజ్యాంగాన్ని అందిస్తే రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలైనా పాలకులు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా దళితులపై దాడులు వారి హక్కులకు భంగ%శీ% కల్పిస్తూ పాల్పడుతున్నారు.ఉదాహరణకి గౌరవ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గావాయ్ గారిపై సుప్రీం కోర్ట్ లోనే మతోన్మాద లాయర్ షూ విసరడం ఒక దేశ అత్యున్నత పదవిలో ఉన్న దళితులకే ఈ పరిస్థితి ఉంటే ఇక దేశంలో ఉన్న సామాన్య దళితుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. అదేవిధంగా మాల జాతికి ఏ సమస్య వచ్చినా వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ గారు భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు చారిత్రాత్మకంగా సుమారు 1200 కిలోమీటర్ల మహా పాదయాత్ర చేసి ముగింపు రోజు 10 లక్షల మందితో మహాసభ జరిపి ఈ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తేవడం జరిగింది, అదేవిధంగా మొన్నటికి మొన్న మాలల, అనుబంధ కులాల విద్య ఉపాధి అవకాశాలను %+శీ%. 99 ద్వారా తీవ్రమైన అన్యాయం జరుగుతుంటే జీవో నెంబర్ 99 ని సవరించి రోస్టర్ విధానాన్ని సవరించాలని రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం పెద్ద ఎత్తున జరిపి ఈ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం జరిగింది.పై విధంగా మాలలకు మరియు దళితులకు ఏ సమస్య వచ్చినా అంబేద్కర్ వారసులుగా ముందుంటూ జాతీయ మాలమహానాడు రాష్ట్రస్థాయిలోనే కాదు ఢిల్లీ వీధుల్లో సైతం నిరసన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకొని ఈ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రాజ్యాంగ హక్కుల సాధన సభ ద్వారా పలు డిమాండ్స్ తో నవంబర్ 26వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ లో నిర్వహించుకోవడం జరుగుతుంది, కాబట్టి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మాలలు,మాల అనుబంద కులాల మరియు దళిత నాయకులు, మేధావులు, విద్యార్థి నాయకులు,కార్యకర్తలు ,పెద్ద ఎత్తున ఢిల్లీకి తరలాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాదరి రాంబాబు, జిల్లా నాయకులు కాళ్ళ రామకృష్ణ,తోగరు అశోక్, రఘు, దండ్రే శంకర్, మరియు మంగపేట మండల అధ్యక్షులు మంచాల నాగేంద్ర కుమార్, వెంకటాపూర్ మండల నాయకులు కుక్కల నారాయణ, నారామల్ల సారంగపాని తదితరులు పాల్గొన్నారు.

# సమరశీల పోరాటాలకు వేదిక సిఐటియు..

రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి..
ఈ నెల 28,29 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభలు.
జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్..




**డోర్నకల్ తెలంగాణ సేన ప్రతినిధి :** సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రంలో సమరశీల పోరాటాలు నిర్వహించడం ద్వారా అనేక విజయాలు సాధించినట్లు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణ కేంద్రంలోని స్థానిక కనకదుర్గ ఫంక్షన్ హాల్ లో సిఐటియు మండల విస్తృతస్థాయి సమావేశం కొండా ఉప్పలయ్య, కుమ్మరికుంట్ల జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట ఉపేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం సిఐటియు అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి, భవన నిర్మాణ కార్మిక సంఘం,మున్సిపాలిటీ అండ్ గ్రామపంచాయతీ కార్మికులు,వీఆర్ఏ, ఫీల్డ్ అసిస్టెంట్,కారోబర్లు,ఆశా వర్కర్లు, హమాలి కార్మికులు, ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల, కార్మిక కర్షక ఉద్యోగ సంఘాల పక్షాన నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి వారి హక్కులను కాల రాస్తున్నారని వారు ఆరోపించారు. ఇన్నేళ్ల కాలంలో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఒక్క పారిశ్రామిక రంగాన్ని ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పించిన పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కుల కోసం నిలబడవలసిన ప్రభుత్వాలు వారికున్న హక్కులను తొలగిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రైతు, కార్మికులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను అమలులోకి తీసుకొచ్చి కార్మికులకు పని గంటలు పెంచి కార్మిక వేతనాలను కుదించిందని కార్మికులను హరి గోస పెడుతున్నారని ఆరోపించారు. ఇటీవల కాలంలో జరిగిన దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని వివరించారు.

**–మరిపెడలో ఈ నెల 28,29 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభలు**

సమస్యల పోరాటాల వేదిక సిఐటియు మహబూబాద్ జిల్లా నాలుగోవ మహాసభలను మరిపెడ పట్టణ కేంద్రంలో ఈ నెల 28వ తారీఖున స్థానిక కనకదుర్గ ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట ఉపేందర్ వెల్లడించారు.ఈ మహాసభల కోసం జిల్లా కార్మిక వర్గంతో పాటు మరిపెడ మండల,పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, కార్మిక, కర్షక ఉద్యోగులు విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బెస్త సంపూర్ణ మండల కన్వీనర్ దుండి వీరన్న,మండల నాయకులు మల్సూర్, సూరబోయిన భిక్షం, ముత్తయ్య, వెంకన్న,వాసు, సైదులు, వెంకన్న,జామూర్తి, లీలాబాయి,కవిత తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో మున్సిపల్ కమిషనర్ దౌర్జన్యం!

"గెట్ అవుట్, లేదంటే జైలు" – వివక్షపై ఫిర్యాదు.

బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు



**తెలంగాణ సేన హుజూరాబాద్ ప్రతినిధి నవంబర్16 :** హుజూరాబాద్ పట్టణంలోని 23వ వార్డులో నివసిస్తున్న బేడ బుడగ జంగాల కాలనీపై మున్సిపల్ అధికారులు తీవ్ర వివక్ష చూపుతున్నారని, కనీస మౌలిక వసతులు లేక 40 సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నామని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్ తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని, 'గెట్ అవుట్' అంటూ బెదిరించారని ఆరోపిస్తూ ఆర్డీఓ, కలెక్టర్‌కు జన సంఘం నేతలు ఫిర్యాదు చేశారు.

**40 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కాలనీ .**

గత 40 సంవత్సరాలుగా తమ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మిషన్ భగీరథ పైప్‌లైన్లు, వీధిలైట్లు వంటి కనీస సౌకర్యాలు లేవని సిరిపాటి వేణు విలేకరుల సమావేశంలో తెలిపారు. గతంలో పాలించిన ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని ఆయన ఆరోపించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా అన్ని వార్డుల్లో పనులు జరిగినా, తమ కాలనీని మాత్రం పూర్తిగా విస్మరించారని జన సంఘం నేతలు మండిపడ్డారు. భారీ వర్షాల సమయంలో తమ ఇళ్లలోకి నీరు చేరి తీవ్ర అవస్థలు పడ్డామని గుర్తు చేసుకున్నారు.

**కాంగ్రెస్ ఇన్చార్జి ఆదేశించినా కమిషనర్ నిర్లక్ష్యం**

ఈ సమస్యను కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ బాబు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే కాలనీని సందర్శించి, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను పిలిచి అభివృద్ధి పనుల కోసం ఎస్టిమేషన్ వేసి ఇవ్వాలని ఆదేశించారు. ప్రణవ్ బాబు సానుకూలంగా స్పందించడం పట్ల కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేసినప్పటికీ, ఈ ఆదేశాలు జరిగి ఆరు నెలలు గడుస్తున్నా మున్సిపల్ కమిషనర్ ఇప్పటివరకు ఎస్టిమేషన్ వేసి ఇవ్వలేదని జన సంఘం నేతలు విమర్శించారు. అభివృద్ధి నిధులు ఉన్నప్పటికీ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

**కమిషనర్ దౌర్జన్యం: 'గెట్ అవుట్' అంటూ బెదిరింపులు**

కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటీకి ?15 కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు మంజూరు అయిన నేపథ్యంలో, తమ కాలనీకి కూడా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు మంజూరు చేస్తారని ఆశించారు. అభివృద్ధిపై సహకరించాలని కోరడానికి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన బేడ బుడగ జంగం జన సంఘం నాయకులను కమిషనర్ అత్యంత దురుసుగా మాట్లాడారని సిరిపాటి వేణు ఆరోపించారు. "మీరు మళ్లీ మున్సిపల్ కార్యాలయమునకు వస్తే మీ పైన పోలీస్ కేసు పెట్టి మిమ్మలను జైల్లో పేట్టిస్తాను" అంటూ బెదిరించారని, "గెట్ అవుట్" అని అగౌరవపరిచారని ఆయన తెలిపారు. అంతేకాకుండా, సిబ్బందితో తమను ఆఫీసులోకి రానీయవద్దని ఆదేశించారని వాపోయారు.

**చర్యలు తీసుకోకుంటే ధర్నా: హెచ్చరిక**

బేడ బుడగ జంగాల కులస్తులను అవమానపరిచి, మనోభావాలను దెబ్బతీసిన మున్సిపల్ కమిషనర్‌పై డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కి మరియు కలెక్టర్ కి ఫిర్యాదు చేసినట్లు జన సంఘం నేతలు తెలిపారు. గత మంగళవారం ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు కమిషనర్‌పై ఏమాత్రం చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. "మా పట్ల దురుసుగా ప్రవర్తించి, అవమానపరిచిన హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్‌పై అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే, త్వరలో మున్సిపల్ ఆఫీస్ ముందు శాంతియుతంగా ధర్నా చేస్తామని" సిరిపాటి వేణు హెచ్చరించారు.




# విద్యారంగంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దాడిని ఖండిద్దాం...

ప్రభుత్వ విద్యా పరిరక్షణ పోరాటాలను విజయవంతం చేద్దాం

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ, రాజన్న సిరిసిల్ల శాఖ

ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ




**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 16 (తెలంగాణ సేన) :** ఆర్గనైజింగ్ సెక్రెటరీ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ వెల్లడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ విద్య వ్యాపారీకరణను, ప్రైవేటీకరణను, కార్పొరేటీకరణను పెంచి పోషిస్తున్నాయి అని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ విమర్శించారు. విద్యా కమిషన్ల సిఫారసులు కాలదన్ని విద్యారంగానికి ఉద్దేశపూర్వకంగా ఏటేటా నిధులు తగ్గిస్తున్నారని, సౌకర్యాలు కల్పించడం లేదని అదే సందర్భంలో రాజ్యాంగ ప్రకటిత లక్ష్యాలకు భిన్నంగా విద్యారంగాన్ని ప్రైవేటుపరం చేసే కుట్రపూరిత ఆలోచనలు చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020 తీసుకువచ్చి దేశ లౌకిక, ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలు ఇచ్చి విద్యను కాషాయీకరణ, కేంద్రీకరణ చేస్తున్నదని దీనిని ఉద్యమాల ద్వారా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అలాగే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన స్రవంతి పాఠశాలలను మెరుగుపరచకుండా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఇంటర్నేషనల్ స్కూల్స్ అంటూ అప్పులు తెచ్చి 24 వేల కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు చేయబోతున్నారని ఇవి కాంట్రాక్టర్లకు వారి కమిషన్లకు ఉపయోగపడతాయని, విద్యారంగానికి మేలు చేయవని ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు . అలాగే ప్రతి సంవత్సరం 2వేల పాఠశాలలు మూసి వేస్తున్నారని దానిని నిలిపివేసి ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై. అశోక్ కుమార్ ప్రసంగిస్తూ సీఎం రేవంత్ రెడ్డి విద్యకు 15% నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చి కేవలం 7.3 పర్సెంటేజ్ కేటాయించారని, ఇది తగదని తక్షణమే కనీసం 20 శాతం నిధులు బడ్జెట్లో కేటాయించాలని కోరారు కేంద్రం కూడా జిడిపిలో 6% నిధులు వార్షిక బడ్జెట్లో 10% కేటాయించాలని కోరారు.. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి ఎం రఘుశంకర్ రెడ్డి ప్రసంగిస్తూ పాఠశాల పర్యవేక్షణకై గత 17 సంవత్సరాలుగా నిలిచిపోయిన ఎంఈఓ, డిప్యూటీ డీఈవో,డీఈవో నియామకాలు చేపట్టాలని ఉపాధ్యాయ బృందాలచే పర్యవేక్షణ చేయించడం తగదని కోరారు.

# మాజీ మంత్రి హరీష్ రావుపై కవిత చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**తెలంగాణ సేన న్యూస్ :** సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, మాజీ మంత్రి హరీష్ రావుపై కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కే. మాణికరావు, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ..మెదక్ జిల్లా పర్యటనలో కవిత మాట్లాడిన తీరు పూర్తిగా అనుచితం. ఆమె వ్యాఖ్యల వల్ల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు ఇబ్బంది పడ్డారు.కేసీఆర్ కడుపున రాక్షసి పుట్టడం బాధాకరం అని సూచించారు.హరీష్ రావు గురించి మాట్లాడకపోతే పొద్దు గడవదన్నట్లుగా కవిత ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పార్టీని ఉద్దేశించి అలా మాట్లాడడం మంచిది కాదని హెచ్చరించారు. ఎవరిని సంతోషపెట్టడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు.మెదక్ జిల్లాలో 7 స్థానాలు గెలిపించిన హరీష్ రావు అక్కడి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న నాయకుడు అని గుర్తుచేశారు.కవిత జైలుకు వెళ్లడం, ఎంపీగా గెలవకపోవడం కర్మ కాదా? అని ప్రశ్నించారు.ఎవరు వదిలిన బాణమో.. ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని,వ్యాఖ్యానించారు.ఇప్పటికైనా ఇలాంటి వ్యాఖ్యలను మానుకోకపోతే%ా% రాష్ట్రవ్యాప్తంగా బీ ఆర్ ఎస్ మాట్లాడుతుందని హెచ్చరిక...పార్టీకి క్షమాపణ కోరాలని డిమాండ్.ఆమె అడుగు వేస్తే పార్టీకి నష్టం చేసే విధంగా ఉండి%ా% కాంగ్రెస్‌కు మాత్రమే లాభం చేకూరుతున్నట్టు కనిపిస్తోందని ఆరోపించారు.రేవంత్ రెడ్డితో వ్యాపారాల కోసం కవిత ఇలాంటి మాటలు మాట్లాడుతోంది అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జియుకెటి-బాసరలో పి. యు. సి. విద్యార్థుల కోసం నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ కార్యక్రమం



**తెలంగాణ సేన నవంబర్ 16 బాసర ప్రతినిధి :** నిర్మల్ జిల్లా :-ఆర్జియుకెటి-బాసర ఆరోగ్య కేంద్రం విద్యార్థులకు ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించడానికి పి.1, పి.2 విద్యార్థుల కోసం అల్బెండాజోల్ టాబ్లెట్ పంపిణీని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మరియు అసోసియేట్ డీన్ ఆఫ్ సైన్సెస్ డాక్టర్ విట్టల్ హాజరయ్యారు, వారు క్యాంపస్లో నివారణ ఆరోగ్య సంరక్షణ ప్రయత్నాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాషువా రాజ్, నర్సింగ్ సిబ్బంది స్వప్న, శ్రీలత, సహాయక సిబ్బంది సాయినాథ్, బాపురావు వైద్య సహాయంతో హెల్త్ సెంటర్ ఫ్యాకల్టీ ఇన్చార్జ్ శ్రీ సాయి రాధాకృష్ణ జి. పాల్గొన్నారు. వారి సమిష్టి కృషివల్ల విద్యార్థులకు పంపిణీ సజావుగా జరిగింది. పోషణ, రోగనిరోధక శక్తి మరియు ఏకాగ్రతను ప్రభావితం చేసే నులిపురుగు-సంబంధిత అంటువ్యాధులను నివారించడంలో సహాయపడటానికి అల్బెండాజోల్ మాత్రలు అందించబడ్డాయి. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన సహాయక అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడానికి సాయపడింది. ఈ కార్యక్రమం వలన పిల్లలలో ఉన్న నులిపురుగులు నశించి పిల్లలకు రక్తహీనత రాకుండా కాపాడుతుందని, విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని వీసి. ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ సూచించారు.

# ప్రజల కలలను సాకారం చేసిన ప్రజా ప్రభుత్వం

ఇందిరమ్మ ఇళ్లతో ప్రతి కుటుంబంలో సంతోషం

ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసిన విప్





**కథలాపూర్, నవంబర్ 16 (తెలంగాణ సేన) :** వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన పెంటల బుజ్జమ్మ నూతన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని నేడు గృహ ప్రవేశం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెంటల బుజ్జమ్మ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో నేడు స్వంత ఇంటి కల సాకారం అయ్యిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# పిట్టల మల్లయ్య దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

చిత్రపటానికి పూలమాల వేసిన జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**తెలంగాణసేన ,** వరంగల్: వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి మండల కేంద్రంలో బీసీ నాయకులు పిట్టల రమేష్ ముదిరాజ్ తండ్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు పిట్టల మల్లయ్య ముదిరాజ్ దశదిన కర్మ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించగా ఆయనతో పాటు బీసీ సంఘం నాయకులు పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, నల్లబెల్లి పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పాండవుల రాంబాబు ముదిరాజ్, డ్యాగల శ్యామ్ ప్రసాద్, డ్యాగల రాము, ముదిరాజ్ సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఆకుల సుభాష్ ముదిరాజ్, తేలు రాంచందర్, ఆకుల శ్రీనివాస్, కొక్కు యాదగిరి, ఆకుల దామోదర్, పిట్టల రామస్వామి, గోనెల నరహరి, ముత్యాల కమల్, మొద్దు శేఖర్, దుగ్గొండి మండల నాయకులు పాండవుల వెంకటేశ్వర్లు, కీసరి మొగిలి, కీసరి స్వామి, రవి, కట్టమల్లు తదితరులు పాల్గొన్నారు.

# జాగృతి జనంబాట కోసం ఖమ్మం దిశగా కవిత ప్రయాణం

శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ నుండి ప్రయాణం



**తెలంగాణ సేన న్యూస్ :** ఖమ్మం జిల్లాలో నిర్వహించబోయే జాగృతి జనంబాట కార్యక్రమంలో పాల్గొనడానికి తెలంగాణ జాగృతి అధ్యక్సురాలు కల్వకుంట్ల కవిత గారు ఈరోజు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు.మధ్యాహ్నం 4 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 9 వద్ద మీడియాతో మాట్లాడిన కవిత , జాగృతి నిర్వహిస్తున్న కార్యక్రమాల ప్రాధాన్యత, ప్రజల ఆశలు, యువతలో సామాజిక బాధ్యత పెంపుదల వంటి అంశాలపై మాట్లాడనున్నారు.ఖమ్మం జిల్లా మధిరలో జరగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సాధారణ ప్రయాణికులతో కలిసి రైలు ప్రయాణం చేయడం ద్వారా ప్రజలతో మరింత దగ్గరగా ఉండాలనే లక్ష్యంతో కవిత ఈ ప్రయాణాన్ని ఎంచుకున్నారు. ఈ జనంబాట కార్యక్రమంలో జాగృతి ఆర్గనైజర్ సెక్రటరీ,నరేష్,జాగృతి ఉపాధ్యక్షులు వరలక్ష్మి, మహిళా అధ్యక్షులు లలిత, MBC ఉపాధ్యక్షులు దీకొండ కవిత, స్టేట్ యూత్ ఉపాధ్యక్షులు నిషా లెనిన్, జాగృతి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న ను పరామర్శించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్.



**డోర్నకల్ తెలంగాణ సేన ప్రతినిధి** :-మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న,కు ఇటివలే గాలి బ్లాడర్ స్టోన్స్ సర్జరీ చికిత్స జరిగిందని తెలుసుకొని మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని మూడో వార్డు సీతారాంపురం కాలనీలోని వారి ఇంటికి వెళ్ళి మండల రిపోర్టర్ చింత వెంకన్న ను పరామర్శించిన,డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, రిపోర్టర్ చింత వెంకన్న ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని వారి ఆరోగ్యం త్వరగా కోరుకోని మళ్ళీ వారి వృత్తి లో కొనసాగాలని అన్నారు, అలాగే వైద్యుల సూచనల ప్రకారం సమయానుసారంగా మందులు వాడుతూ.. విశ్రాంతి తీసుకోవాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తగు సూచనలు తెలిపారు, వారి వెంట,మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి ఆయూబ్ పాషా,రేఖ వెంకటేశ్వర్లు, వీరబోయిన మురళి, జర్పుల, కాలు నాయక్,మాజీ వార్డ్ కౌన్సిలర్ పానుగోతు వెంకన్న,బాలాజీ ,కెలోత్ వస్రాం,శ్రీను,అరవింద్,చింత వెంకన్న వారి కుటుంబ సభ్యులు, తదితరులున్నారు,

# శిరీష జ్యూయలరి షాపును ప్రారంభించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్,



**డోర్నకల్ తెలంగాణ సేన ప్రతినిధి :-** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని రామ విలాస్ బజార్లో మాలి ప్రతాప్ సింగ్ యొక్క నూతన శిరీష జ్యువలరీ షాప్ ను ప్రారంభించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్ మరియు మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు వారి వెంట గుగులోతు వెంకన్న,జర్పుల కాలు నాయక్,పానుగోతు వెంకన్న,జాటోతు బాలాజీ,పేపర్ శ్రీను,కేలోత్ వస్రాంనాయక్ ,బాలాజీ, బోడ రూప్ల,శ్రీను,బోడ రెడ్డిగారు,రాందాస్, మక్బుద్ , మాలి ప్రతాప్ సింగ్ వారి యొక్క కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు..

# డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన సదస్సు

ట్రాఫిక్ భద్రతపై పోలీసుల పిలుపు




**ముధోల్, నవంబర్ 16 ంతెలంగాణ సేన న్యూస్ :** ముధోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు చేపట్టిన చర్యలలో భాగంగా, ఆదివారం బస్టాండ్ ప్రాంతంలో 'డిఫెన్సివ్ డ్రైవింగ్' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బిట్ల పెర్సీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. రోడ్‌పై నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా వెళ్లడం, మద్యం సేవించి డ్రైవ్ చేయడం వంటి వాటి వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని ఎస్సై తెలిపారు. సరైన రీతిలో వాహనాలు నడపడం, ట్రాఫిక్ నియమాలను పాటించడం మన ప్రాణాలను కాపాడుతుందని పిలుపునిచ్చారు. సదస్సులో పలువురు ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు పాల్గొని ప్రశ్నలు అడిగి, తమ అభిప్రాయాలను వెల్లడించారు. పోలీసులు రిఫ్లెక్టర్ టేప్‌లు, రోడ్డు భద్రతపై తీసుకోవల్సిన చర్యలు వివరించారు.

# బాసర క్షేత్రంలో పోటెత్తిన భక్తజనం

' గోదావరి నది వద్ద కోలాహలం

' అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో భక్తజనం



**తెలంగాణ సేన నవంబర్ 16( బాసర ప్రతినిధి ) :** నిర్మల్ జిల్లా:- బాసర పవిత్రమైన పుణ్యక్షేత్రం శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం సెలవు దినం కావున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించు కునేందు కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండే కాక మహారాష్ట్ర నుం డి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుండి భక్తులు గో దావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి నది తీరాన కొలువైన సూర్యేశ్వర ఆలయం మహా శివునికి అభిషేకం అర్చన పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం అమ్మవారిని దర్శించు. కునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. భక్తులు తమ చిన్నారులకు ఆలయ సన్నిధిలోని కుంకుమార్చన పూజలు అక్షరాభ్యాస మండపంలో క్షరాభ్యాస పూజలను ఆలయ అర్చకులచే జరిపించారు. అనంతరం ఆలయంలోని శ్రీ జ్ఞాన సరస్వతి మహాలక్ష్మీ, మహాకాళి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిపించారు. అనంతరం భక్తులు అమ్మవారి సత్రంలో అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఈవో అంజనీ దేవి. ఆలయ సిబ్బంది. బాసర ఎస్సై బి శ్రీనివాస్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.